'లి'గాడు

కవికొండల వెంకటరావు

సర్వ సామాన్యంగా తెనుగు వారిచే నుపయోగింప బడుతూన్న "లిగాడు" శబ్దాన్నే విడిచి "లి"గాడుగా మార్చి దానిని సార్థకంగావించే విధంగా ఈకథలో వాడుతూ వున్నాను. పాఠకులు పరామర్శింతురుగాక! వేరు మరీ "వన్నెకాడు" "అందగాడు" "ఆటకాడు" "పాటగాడు" అని. అట్టివాడే "లి"గాడున్నూ

"లి"గాడు అనగా—కొడవలి, ... గొడ్డలి, గుద్దలి, రోకలి, నాగలి, వీనిని పనిముట్లుగా గైకొని శ్రమపడే మగవ్యక్తి. ఎంత శ్రమపడ్డా వాడు సంపాదించే సంపాదన, కలి, అంబలి, ఈ రెండింటినీ మించిన ఆహారాన్ని సంబాళించుకోవడానికి చాలదు. వాడనేమాటల్లో "దాపలి" "వెలపలి" అని వినబడేనిగాని ఆపదాలు "గిలక" పరంగా కాకుండా "గిత్త" పరంగా వాడేవి అని తెలుసుకోండి. అంతకంటె ఎక్కుడువిద్య వానికడ ఉండడాని కవకాశమేలేదు. వానికున్న కష్టాలన్నీ విభజిస్తే రెండింటికిందకు వస్తాయి. ఒకటి ఆకలి. రెండోది చలి. సంఘంలో వానిఅవధి ఎల్లాగు వుంటుందంటే సంపెటపెట్టు తినే దాగలియొక్క అవధిలాగుంటుంది, విన్నారా?

ఇటువంటి "లి"గాండ్రు వాళ్ల భార్యలు "లి"కత్తెలు ఒకకొందఱు కలిసి వున్నట్టాయినా వాళ్లందర్నీ మూకుమ్మడిగా మనం "లిగాడుప్రజ" అని అనవచ్చును.

అనవచ్చును ఏమిటి? వాళ్ల మొహాల్లోని దిగాలే చెబుతుంది చూడ్డంతోనే "వీళ్లు "లిగాళ్ళుప్రజ" అని. ఆనందం అనేది వాళ్లకళ్లల్లో మృగ్యం. ఎలావుంటుంది? వాళ్ల బ్రతుకూ, పట్నవాసపు రోడ్డుపక్కను నాటబడ్డ చెట్టుయొక్క బతుకూ వొక్కటాకీగా ఉన్నప్పుడు? ఆచెట్టు కిందే వాళ్లవిడిది అయినప్పుడు? ఆచెట్టుతప్పితే మఱిఆస్కారం ప్రపంచంలో - ఈ ప్రపంచంలో ఎక్కడా వాళ్లకు కానరానప్పుడు?

ఓసాయంత్రం అటువంటి జనసమూహం తాలూకు ఓ కుటుంబాన్ని చూచి వితర్కించడం నాలో జరిగింది. కాబట్టే ఇంత బలవత్తర సాక్షిగా వాళ్లనుగురించి నొక్కివక్కాణింపగల్గుతున్నాను. నమ్మండి నామాట పాఠకులు!

ఆ కుటుంబాండి సంసారమన్నా వొక్కటే సన్యాసంఅన్నా వొక్కటే, ఆస్తినిగురించి జాబితా వ్రాయడం అంటూవస్తే – తవ్వేమట్టి నెత్తికెత్తుకునే రెండుతట్టలు, వట్టివి కావట్లో ఇటూ అటూ పన్నుకుని, ఆతట్టల్లో పెద్దకుండలు రెండూ, కూంతకూంత గంజి వద్దవున్న ముంతలు రెండూ, వుంచుకుని, బుజాన్ని గునపం గునపానికి పార తగుల్చుకొని మొగాడు ముందు వస్తూవుంటే, ఆవెనకనే ఆడది వోచంకను కుఱ్ఱాణ్ణి సముదాయించుకుంటూ, రెండోచేత మాలివోల్లె తోల్లికా, పుచ్చుకు మగాణ్ణి అనుగమిస్తూ "ఈచెట్టుకింద దిగుదాంరా!" అనిపట్నంలో గోదావరి గట్టుప్రక్కను వోచెట్టుమొదట దిగారు, నడచినడచి ఎక్కణ్ణుంచో వచ్చినట్టు కనబడే దుమ్ముకాళ్లతో చెమ్మటతలకట్లతో—

సన్యాసి వస్తే ఎదురువెళ్లి పట్నంలోని గృహస్థులు అనేకమంది తమయిళ్లకూ తమయిళ్లకూ పిల్చి భిక్షలు పెడతారేగాని యిలాంటివాళ్లను ఎవరున్నూ ఆహ్వానించరు. వారి కెవరున్నూ ఆతిథ్యమివ్వరు. ఉతకాచిరతాలేని ఊరచెట్లు కాబట్టి అవి నిర్మొహమాటంగా వాళ్ళను తమ కిందకు రానిచ్చాయి. రానిచ్చాయి అన్నమాటేగాని కొంతసేపటివఱకూ వాళ్ళను ఆచెట్లున్నూ పలకరించలేదు. గాలికూనలు బయలుదేరి చెట్లచెవుల్లో వీళ్లునావాళ్లు సుమండీ అని ప్రేరేపించేదాకా లాతిగానే వూరుకున్నాయి.

నాడు గాలికి చెట్లుచలించడంలో వొక అపురూపమైన చలవ—ఆపని వాళ్ళమూలంగానో ప్రకృతిమూలంగానో ప్రపంచాని కంతకూ సోకింది. ఆకాశం చూసేసరికి వో అనుకోని మబ్బుతునక బంగారం వర్షించినట్టు సాయంకాలం నీరెండకాంతిలో వర్షిస్తూ, చేరికబడ్డదై, చెట్లనూ, చెట్లకింద దిగినవాళ్ళనేకాకుండా ఆపరిసరప్రాంతాన్ని అంతనూ అతివినోదవంతంగా మార్చివేసింది. పెద్దవానగాపడలేదు. గోరునీళ్లు చల్లినట్టుగా పడింది. అంతేశాన. వెంటనే కష్టజీవులయొక్క కనురెప్పలమీది దుమ్ము, చెట్ల ఆకులయొక్క ధూళీ కూడా కడిగివేయబడినట్టయింది. కమ్మనిశ్వాస భూదేవిదా, భూదేవి మీది ప్రాణికోటిదా అన్నట్టు వ్యాప్తమైంది. అంతేకాకుండా "అదివఱకెక్కడున్నవో యీపక్షులు" అని అనిపించేలాగు ఆకుపచ్చని చిలకలు, తెల్లని కొంగలు, నల్లని కాకులు, గోధుంవన్నె గోరింకలు, కొన్ని ఎగు

రుతూ, కొన్ని నిశ్చింతగా కూర్చుని, కొన్ని అపస్తూ, కొన్ని కులుకుతూ సందడించేశాయి.

దాంతో పట్నంలోనూ ప్రకృతి శోభకు తావు వుంది అని తట్టింది. మఱీన్నీ ప్రకృతితోపాటు. పామర జనానికిన్నీ ఆశ్రయం వుంది అని తోచింది.

"లి"గాని అంగన తన అనుగు బిడ్డణ్ణి వెంటనే చెట్టుకు తన విడి పుట్టంతో వొక వుయ్యాలా వేసి ఆ వుయ్యాల్లో పండబెట్టి—

"తొలుత బ్రహ్మండంబు తొట్టి గావించీ, నాలుగు వేదాల గొలుసుల మరించీ" అని వూచినట్టుగా అంత రాళమం దొక్కసారివూచి మగని కోసంగాను చూచింది.

మగ డక్కడ లేడు. "ఆరి వీడి జిమ్మడ! ఇంకా ఈ కొత్తవూళ్లో అడుగెట్టామో లేదో వీడి కప్పుడే ఏ వొంక దానోసనకొట్టిందిరా బాబా! ఆకల్లోసన! ఆకల్లు పాకోసన! ఏత ట్టుకు సచ్చాడని నెమకేదాన? ఆడు మళ్లీ తన తాగుబోతువాలకంతో యీపెద్ద మహానగరంలో దారీతె న్ను నాఅంకకు కనుక్కోగలడా! దేవుడా!" అని దీనంగా దిక్కులు చూచింది. చూచిచూచి నిరాశా భావోద్రిక్తమైంది. ఆభావంనుంచి తీవ్రమైన క్రోధభావం లోనికి మాఱింది. "వీడు! వీడు! మొగు డనుకోనా మొద్దులను కోనా? బువ్వ బూరికింద, గంజి పాయసంకింద గడు స్తూవున్న యీబతుకుని లాయిరు బందులుపెట్టేవాడు వీడా తాళిగట్టి నోడు? రానియ్యి! రాడూ? నిసి రేత్రికైనారాడూ? వచ్చాడా వాణ్ణి అంతదూరంలో ఆచెట్టుకు రెక్కలు విరిచికట్టి చింతబరికెలతో బుద్ధిసెప్పి గడ్డెడతా!" అని నిశ్చయించుకుంది. నిశ్చయించుకుని బిడ్డడంతలోయేడిస్తే వాణ్ణి యుయ్యేలలోనుంచితీసి, నేలనే కూర్చుండబెట్టి, యుయ్యెలచీరవిప్పి, అదోతలగడాగా చేసుకు,దానిమీద తనకట్టుకొంగు పఱచుకొని, పక్కలో బిడ్డణ్ణిపరుండబెట్టుకు పట్టీపట్టనికునుకు వానితోపాటు పోతూవుంది.— మి నుకుమినుకుమనే చుక్కల్లే, దీపం లేక, చీకటిలోనే కాలంవెళ్లబుచ్చు తూంది. విశ్వేతరమంతా అంధకార బంధురంగా వుంది.

రేత్రి పదకొండుఘంట లయింది. బిడ్డడు మంచి నిదరలో ఉన్నాడు. మగని అజా పజా ఏమీా కనిపించడం లేదు. ఏం చేస్తుంది ఆ ఇల్లాలు? "ఎక్కడికి పోయినాడో యీ దిక్కు మాలినపక్కణంలో" అని వెక్కు వెక్కున యేడ్వసాగింది.

ఆలాఏడుస్తూండగానే ఆమెవీను లకు "బ్లెడీహుం" అని వొకశబ్దం విని పించింది. అది మనిషిగొంతుక, మగ వానిగొంతుకలాగు తోచింది. కళ్ళ నీళ్లు తుడిచివేసికొని ఆమె "వస్తు న్నాడు. నెఱ్ఱొలికించుకుంటూ వీడికీ రోజుతో బుద్ధి రావాలి" అని తన తాత్కాలికపు తలగడాచీర తీసి పొడుగ్గా విప్పింది. తిరిగి ఆవల వ్యక్తి "మేరీ! డార్లింగు! హాల్లో! బ్లెడీ! టారీ! లిలీ! బులీ! జోలీ!" అన్నాడు. —"నన్ను ఒంటిదాన్ని చేసి యింకా ఏడిపించాలని అనుకొం టూవున్నావురా. నేను జడిపిస్తే జడిసే దాన్ని కాదు. ఏడిపిస్తే ఏడ్చేదాన్ని కాదు" అని అమె ఏం చేసిందీ అంటే — ఆవలవ్యక్తి అంత దూరాన్ని వుండగానే తన తలగడ చీర వుచ్చుపోసి విసరినట్టు విసరి చెట్టుచెంత కమాంతంగా ఏనుగు నీడ్చినట్టు ఈడ్చి రెక్కలు విఱిచికట్టి "ఈరేత్రి తెల్లవార్లూ అలా మిడకవలసిందే నీవు" అంది. ఆవలివ్యక్తి ఎంచేతో కోరలుతీసిన పాములా కొంతసేపు నీరసస్థాయిలో పడ్డాడు. దీపం పెట్టి చూడ్డానికి స్త్రీ దగ్గఱా దీపంలేదు. వచ్చిన పురుష వ్యక్తి దగ్గఱా లేదు. కాని ఆ వచ్చిన వ్యక్తి శరీరచ్ఛాయ శరీరాచ్ఛా దనచ్ఛాయ సమస్తం నలుపురంగే. దాని మగని రంగూ దాని మగని గుడ్డలరంగూ అట్టిదే. పోనీ కళ్లు తెలుపేమో అని గుర్తించడానికి ఎఱ్ఱనికళ్లు తాగినప్పటి కళ్లు, ఎట్టివారి కళ్లైనా చీకట్లో నల్లగానే కనిపిస్తవి.

ఇంతకూ ఎవర్రా ఆ కొత్త వ్యక్తి అని మనకు జిజ్ఞాసగాని ఆమె కు లేనేలేదు ఆసమయాన్ని. ఆమెకు ఆ వచ్చినమనిషి, బాగా తాగి కై పెక్కివున్న తన మగడనే-నిస్సందే హంగా తన మగడనే-ఘట్టినమ్మకం.

దూరంగా ఠంగుఠంగుమని పం డ్రెండుకొట్టారు తాలూకాలో. ఈ పామరాంగనకు దాని పరకాయింపే లేదు. ఆమెకు సూర్యచంద్రు లున్న ప్పటికాలం తెలిసికొనే పాళపు విజ్ఞా నమే కలదు గాని మఱిలేదు. చుక్క ల్నిబట్టి సుంతా తెలీదు. ఆచెట్లకింద నుంచి చుక్కల్ని చూడ్డం అనేది కూడా దుస్సహము. చూడలేదో బ్రతికిపోయింది. చూచివున్నట్టాయి నా బ్రహ్మరక్షస్సో, పిశాచమో ప్రాణం అడలించియుండేది.—"బ్లెడీ హుం!" "బ్లెడీహుం"!—

ఈ "బ్లేడీహుం" అనే వాణ్ణిగురించి మనం రైట్‌రాయల్‌గా ఎరిగివుండాలీ అంటే తఱుచు మెయిలు బండీ ఎక్కుతూవుండాలి. ఊరకే ఎక్కడమేకాకుండా మెయిలు బాగా పదినిమిషాలు పదేను నిమిషాలు ఆగుతూవుండే ప్రతీ స్టేషనలోనూదిగి ఇంజెన్‌దగ్గరకు వెళ్లి అతివిచిత్రంగా గమనిస్తూ రావాలి. అప్పుడు ఆ ఇంజెన్‌యొక్క జఠరాగ్నికి నిరంతరం రాక్షసిబొగ్గు సమకూర్చే తెల్లదొర వొక డొపిస్తాడు. అసలు తెల్లని చాయవాడైనా చేసేపనినిబట్టి నీగ్రోలా నల్లనివన్నె ప్రకటిస్తాడు. ఈ "బ్లేడీహుం!" అన్నది ఆదొర.— ఆదొర నామధేయం మిస్టర్ ఎలూఫ్. ఆయనకు వొకభార్యా వుంది. ఆవిడ పేరు మిసెస్సు ఎలూఫ్.

మిసెస్సుఎలూఫ్ మాంచి ఫాషనబుల్ లేడీ. క్లబ్బులో డ్యాన్సింగుకు ఎన్నికగన్న అన్నులమిన్న. డ్రెస్సు వేసిందీ అంటే ఆమెడ్రెస్సు ఇతర లేడీస్‌కు అందటికీ వరవడి. ఒకరవ్వ వుంగరం వేలికి, ఒకబంగరు గొలుసు మెళ్లో అంతే ఆమె పెట్టుకునే ఆభరణాలు. అవితేమాత్రం! మెడ తిప్పకోకుండా వున్నా గొలుసు అల్లాడ్డం వోసొగసు, మెడ తిప్పకొంటూవున్న గొలుసు అల్లాడకపోవడం వోసొగసు. ఇలాగ్గా వొకవస్తువును పుచ్చుకునే రెండువిధాల సొగసులు ఆమెచూపిస్తూవుంటే ఎవరైనా ఆమెనువింతవింతగా చూడవలసిందే..మడి వేలివుంగరం! అస్తమానం ఎవరినోవొకర్ని పిలుస్తూవున్నట్టే, ఎవరినో వొకర్ని తలుస్తూవున్నట్టే! ఏమా అంటే అందఱూమాటాడుతూ, మాట కనుగుణ్యంగా అభినయిస్తే ఈమెఊహిస్తూ ఊహకేఅనుగుణ్యంగా అభినయిస్తుంది. చూస్తే ఆమె వూహిస్తూవుండని ఘటికే లేదు. కనుక ఆమెయొక్క తదంగుళీయకం నిరంతరాభినయంతో కూడుకున్నదై విశ్వమోహనంగా అగపించింది.

ఇటువంటిసరళ మిస్టర్ ఎలూఫ్‌ను వలచి పెళ్లాడిందీఅంటే అది సాంఘిక సమస్యల్లో మెట్టుసమస్యయే యగుగాక, మన కిచ్చట అప్రస్తుతం. అది కదపరాని సత్యము.

రోజూ మిస్టర్ ఎలూఫ్ రేత్రిపూట తప్పతాగి, ఒక్కొక్కప్పుడు రోడ్డునడాన్న, ఒక్కొక్కప్పుడు డస్టుబిన్నులకాడ, ఒక్కొక్కప్పుడు గట్టుకీపక్క, ఒక్కొక్కప్పుడో గట్టుకాపక్క, ఒక్కొక్కప్పుడు గట్టుమీద, ఎక్కడపడితే అక్కడే వొళ్లు తెలియక పడిపోవడం రివాజు. మిసెస్ ఎలూఫ్ డ్యాన్సుగీన్సు అయిపోయిన తరువాతను ఒకబాటరీలైటుచ్చుకు రోడ్లంటా రోడ్ల సైడంటా వెతికి తన మగణ్ణి కనుక్కొని ఏకూలివాడి సాయమన్నో తనయింటికి జేరేసుకుంటూ ఉండడం రివాజు.

"లి"గాడు తన భార్యను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయిన రేత్రి కూడా పై దంపతులకు తమతమ రివాజులు యథాప్రకారం జరిగినయి. మిస్టర్ ఎలూఫ్ తాగి మైమఱచి "బ్లేడీహుం" అని అరచుకుంటూ వచ్చివచ్చి చెట్టుకింద పూర్వోక్తప్రకారం బందీ అయినాడు. కాని అతగాడు "మిస్టర్ ఎలూఫ్" అని "లి" కత్తెకేం తెలుసును. ఆ తాగి తూలుతూ వచ్చిన మానవుడు తన మగడే అనుకొంది. అనుకొని చేయదలచుకొన్నంత పనీ చేసింది- చింతబరికతో బాజా వాయించడం ఒక్కటి మినహాగా!

ఇక అక్కడ "లి" గాడు.— వా డెక్కడికి పోతాడు? అసలు గట్టె వచ్చేటప్పడే పసికట్టి వుంటాడు దిశ. పసికట్టి అనుకొని వుంటాడు. "ఒకగ్లాసుడు ఇద్దఱికొక్కమందు" అని అనిపించే యీకల్లు తాగకతప్పదని. తిన్నగా కల్లు అంగడి వున్న రోడ్డుచ్చుకు అంగడికేసి నడచేడు.

రోడ్డుమీద విద్యుద్దీపాలు వెలిగిపోతున్నాయి. ఎడాపెడా, రుప్పరుప్ప చూచే కుక్కల్లే, కొట్టుకొట్టూ తొంగిచూచీవాడు. పట్నవాసాల్లో కల్లంగళ్లు ఊరిచివరకాక ఊరి మధ్యనే వుంటవికూడాను. దానివాసన రంయిని కొట్టింది వోచాయను. లోపల జనసంకులంయొక్క ధ్వని మిక్కుటంగా యివలకు వినబడుతూ వుంది. కాని జనం కనిపించడంలేదు. గుమ్మం వద్ద మాత్రం "దయచెయ్యండి" అని ఆహ్వానం బోర్డు వ్రాసివుంది. "లి"గాడు ఈ జన్మలో చదువురానివాడైనా పూర్వజన్మసంస్కారం కలవాడేమో—ఆ అక్షరాలబోర్డు వాణ్ణి ఆహ్వానించినట్టయింది. తొంగిచూచేడు. "ఏం తొంగి చూస్తున్నావు? వస్తేరా! లోపలికి! లేకుంటే నీదారిని పో! అంతేగాని తొంగిచూడరాదు" అన్నాడు లోపలనున్న వొకవ్యక్తి. మరోవ్యక్తి "వె!వె! వెధవని లోనికి లాగిప—" అని వెనక్కి తానే పడిపోయినాడు. మూడోవ్యక్తి "డబ్బుల్లేని ముఖంలాగుంది నీది. నడువు. ఇక్కడ అరువుగిరువు జాంతానై" అన్నాడు.

ఈ కడమాటతో "లి"గాడు కొంచెం వెనక్కు తగ్గాడు. వాడిదగ్గఱ డబ్బేదీ? నాడసలేసున్న. రోజంతా ప్రయాణంతోనే చెల్లు. కొత్తవూరు పనికోసం రావడంలో.

అయితే డబ్బూగిబ్బూ లేకుండా తాగుడుకు బయలుదేరడంలో అర్థమేమి టంటారేమో. అర్థమేమీ లేదు. ఏమారి పరుగులెత్తడంతప్ప. ఓపర్యాయం ఆపొద్దు కల్లుపాక చుట్టూ తిరిగి దానోసనకు రంజిల్లడమే లోపలికుట్ర.

అయినా ఆశ పోలేదు. ఆకొట్టు కాకపోతే మఱోకొట్టుండదూ? మఱోకాడ! అని యింకా బాగా ముందుకు సాగాడు. రేత్రి ౧౦, ౧౧ అయింది. తిండితినలేదేమో ఆపొద్దు— రోడ్డుపక్కన ఈతట్టు, దారిమఱచి చతికిలబడ్డాడు. రోడ్డు కాపక్కన ఆతట్టుఓమహాహార్మ్యం వాడిముందు కళ్లక్కట్టినట్టు రెండు అంతరువుల్ది కనిపిస్తూవుంది!

హార్మ్యంయొక్క దిగుభాగం వొక పెద్దహాలు, పైభాగంపదహారుగదులు. ప్రతీగదిలోను నిల్వుటద్దాలు, చెల్వు సోఫాలు, చల్వరాళ్లు, హాల్వాతీపి మంచాలు, కల్వపూ మెత్తనిపరుపులు వున్నయి. అన్నిగదుల్లోను లైట్లు. లైట్లుకుపేడ్లు. ఆరిపేయబడేవి కొన్ని వెలిగించబడేవికొన్ని యిల్లా గావుంటూవున్నాయి.

"లి"గానిదృష్టి పైగదులమీాదికి పోనేలేదు. అసలువానిదృష్టి ఆది లోనేకిందిహాల్లో ఆగిపోయింది. అదే వాడికి పరమానందదాయకంగా వుండింది. రోడ్డుపక్కను చతికిలబడ్డ వాడల్లా "గుళ్లోగోవిందరాజుల విగ్రహం శయనించినట్టు ఓచేతిమీాద తలానుకు ఆహాల్ను సూటిగా చూస్తూవున్నాడు.

హాల్లోనలభైజతలు, ఆడమగజతలు, తెల్లనిశరీరాలవాళ్లు,మిలమిల ప్రకాశిస్తూ జిలజిలపాకేరోమాంచంతో నాట్యమాడుతూవున్నారు. కిటికీలన్నీ తెగివబడివున్నాయి. లైట్లన్నీ వెలిగించబడివున్నాయి. బ్యాండు వాయించబడుతూవుంది. ఆర్గన్ మోతబంయిమంటూవుంది. షేంపేన్ బాటిల్సు, కార్కులు పైపుపడేధార చాలక, అధోభాగాన్ని కొట్టబడ్డవై గ్లాసులోకివొంచబడుతూవున్నాయి.

"లి"గాడికి పైదృశ్యమేమిన్నీ అర్థంకాలేదు, ఒక్కవాళ్లు గ్లాసు పుచ్చుకుతాగేటప్పటిచేష్టతక్క. ఆలోపల వాళ్ళల్లో ఎవరైనా గ్లాసెత్తి తాగుతూంటే తానుకూడా రోడ్డు పక్కని చీకట్లో నోరుతెరచేవాడు. పాపం! ఆలా ఎన్నిసార్లని తెరవగలడు? ఎంతకాలం తెఱచి వుంచుకోగలడు. క్రమంగా ఆవలింతల్లోకి దిగి తనకు తెలియకుండానే నిదరోయాడు.

హాల్లో గడియారం రాత్రి ఒంటిగంట కొట్టింది. అంతా నిశ్శబ్దవంతంగా మాఱిపోయింది. దీపాలారిపేశారు హాల్లో. పైగదుల్లో అక్కడక్కడ కొందఱు స్త్రీలు కొందఱు పురుషులు దిగబడ్డా అవికూడా చీకటికోణాలే. హాల్లోనివారు చాలామంది హార్మ్యం వెలుపడి ఆలాఈలా తమ తమ లోగిళ్ళకు వెళ్లిపోయినారు. అందరూ అనక చాలామంది ఎందుకు అనడం వచ్చిందీ అంటే ఒకామె తన యింటికేసి కాక "లి"గాడు పరుండియున్న రోడ్డుమీాదకు వచ్చి యిటూ అటూ చూచి రోడ్డుసైడ్డే "లి"గాడు వున్న దెసకు వాణ్ణి చూడకుండా అడ్డంగా నడుస్తూవుంది.

నడుస్తూ ఆమె ఏమి చేసిందీ? తన పాదంతో తనకు తెలియకుండా "లి"గాణ్ణి తన్నింది. "లి" గాడు "చచ్చాను" అని కెవ్వున అరిచాడు. ఆమె తనచేతిలో తయారుగా వున్న బాటరీలైటు వేసింది. "హు ఆర్ యు బ్లెడీ" అంది. "లి"గాడు మాట్లాడలే. ఆమె మఱేరవంత కీచుగా "కోన్ హై?" అంది. "మాలోణ్ణి కాదు తల్లీ" అన్నాడు. "లి" గాడు. "మాలోడివి కావు? కూలోడివా?" అంది. "ఉఁ" అన్నాడు. "స్టాండ్ అప్" అని జబ్బట్టుకు లేవదీసింది వాణ్ణి. "లి" గాడు తానాపూట తిండి తినలేదన్నట్టు కడుపు తప్పటగా చూపిస్తూ వంగివంగి సలాము పెట్టాడు. ఆమె "ఫరవా నై, ఈ రొఠి తిను. ఈ నీళ్లు తాగు." అని ఫ్లాస్కులోను చేతిబుట్టలోను ఉన్నవాటి నిచ్చింది.

"లి"గాడు ఆరొఠిగబగబ తిని గడగడ ఆనీళ్లుతాగాడు. "నన్నుఫాలో" అని చేసంజ్ఞ చేసింది. "లి"గాడు ఆమెవెనకనే బంటు అయి నడుస్తున్నాడు. ఆమె ముందు బారి తీస్తూవుంది. నడుమనడుమ సైడ్డురోడ్లకు, సందుగొందుల్లోకి బ్యాటరీలైటు వేస్తూవుంది.

"నీవు తాగుతావా?" అంది ఊరికేనే "లి"గాణ్ణి పలకరిస్తూ ఆస్త్రీవ్యక్తి ఒకచోట ఆనడకలో. "నేను తాగనమ్మా!" అని అప్రయత్నంగా బొంకేశాడు "లి"గాడు. ఆమె "నా

భర్త తాగుతాడు. ఈరోడ్డుపక్క-నో ఆగట్టుకిందో పడిపోతూ వుంటాడు. కనిపెట్టిచూడు. నివ్వ్యాను” అంది. అంటూ బ్యాటరీలైటు ఆర్పివేసింది. ఆకాశంకేసి చూసింది. “ఓస్టార్సు! ఓక్లౌడ్సు!” అని కళ్లమ్మట సీళ్లెట్టుకుంది.

దూరాన్నే “బ్లెడీహుం! హంగర్” అని వినిపించింది. “అక్క-డ నామొగుడు వున్నాడురా! త్వరగా రా!” అని తాడిచెట్టు ప్రమాణానికి ఎగసే తన బ్యాటరీలైటు కాంతిని నేలబారుగా ఆమాట వినిపించిన దిక్కు-కు వేసికుంటూ నడవసాగింది. వెళ్లినకొద్దీ చూపులో మనిషి, మనిషిలో తనమగనిపోలిక కనిపించింది. “ఓ మై గాడ్! అతడే నాడియర్ ఎలూఫ్” అని వేగంగా డాసి ఆచెట్టుకు నిర్బంధితుడైయున్న వానికట్టు విప్పింది. బ్యాటరీలైటు ముఖం మీదికి వేసి చూసింది. తనముఖం నికి చూపింది. వారిద్దరూ ఎలూఫ దంపతులు!

“ఈలా నిన్ను ఎవరు అవమానించినారు?” అనిఅడిగింది మిసెస్సు ఎలూఫ్—“నేను నామొగుణ్ణి! పోయే నాపరతా!” అంది “లి”కత్తెసగం సగంలేస్తూ పక్క-లో పండుకొన్న బిడ్డణ్ణి వొత్తిగించుకుంటూ.—మిసెస్సుఎలూఫ్ “నీమొగుడెవరు?” అని బ్యాటరీలైటు “లి”కత్తెముఖమ్మీదికి వేసింది. “అది నాపెళ్లాం” అన్నాడు “లి”గాడు. “ఆబిడ్డడు?” అంది మిసెస్సు ఎలూఫ్. “మాపిల్లడేనమ్మ!” అంది “లి”గాని అంగన.

“నీభర్త తాగడు మిక్కి-లి మంచివాడు.” అంది మిసెస్ఎలూఫ్. “ఏంరా? తాగుడికి కాదంట్రా పోయిందీపొద్దునివు?” అంది“లి”కత్తె. “లి”గాడు, “కమ్మనిరొట్టెట్టారే అమ్మగారు. కల్లులొట్ట యికసెల్లే!” అన్నాడు. మిస్టర్ఎలూఫ తెలివిని బడ్డాడేమో ఊరికేసిగ్గుపోతున్నాడు. మిసెస్ఎలూఫ్ “లి”గానితో“ కూలీ! నామగనిని నాతోకూడా ఇంటికి జాగర్తగా తీసికొస్తివా నీకోరూపాయఇస్తాను” అంది. “అక్క-ర్లేదమ్మా కుసంతగంజితాగితే దొరగారికి నడకబ్బుద్ది.” అంటూ “లి”కత్తె తన మగనికోసమని ముంతలోసెట్టివుంచిన చప్పనిచలిగంజి తెచ్చి మిస్టర్ ఎలూఫ్ ముందుపెట్టింది. మిస్టర్ ఎలూఫ్ గడగడా బెడ్కాఫీలాగు ఆగంజి తాగి “థాంక్సు” అన్నాడు.

ఉషఃకాంతులు చిరునవ్వు నవ్వినాయి. పగటిపూటా అది? ఎవ్వాని జీవితగ్రంథంలోనూ క్రొత్తపుటా అది?